సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



శుభలేఖలు పంచి వస్తూ..

దెందులూరు మండలం కొమిరేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు.

8లో ▸



వేతన యాతన

ప్రభుత్వాస్పత్రుల్లో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలివ్వడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది.

8లో ▸



చి'వరి'లో కలవరం

రబీ కోతల సమయంలో అకాల వర్షాలు గుబులు పుట్టిస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు.

8లో ▸

న్యూస్‌రీల్

డెలివరీ బాయ్స్‌పై వేధింపులు తగవు



ధర్నా చేస్తున్న గ్యాస్ డెలివరీ బాయ్స్

భీమవరం: జిల్లాలో గ్యాస్ డెలివరీ బాయ్స్‌పై వేధింపులు ఆపకపోతే సమ్మెకు సిద్ధమని జిల్లా గ్యాస్ డెలివరీ బాయ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు హెచ్చరించారు. గురువారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో జరిగిన ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. డెలివరీ బాయ్స్‌కు కనీస వేతనాలు అమలు చేయకపోగా ఇటీవల అధికారులు, డీలర్ల వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. డీలర్స్ డెలివరీ వాహనాలకు పెట్రోల్, డీజిల్ సమకూర్చడం లేదని, కిలోమీటర్ల దూరం సిలిండర్లు సరఫరా చేసినా వినియోగదారులు కనీస చార్జీలు కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ డెలివరీ బాయ్స్ జీతాలు తక్కువగా ఉన్నాయని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక : జిల్లా గ్యాస్ డెలివరీ బాయ్స్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వై.వెంకటేశ్వరరావు, బి.వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా ఎం.సీతారామయ్య, సనపల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా సత్యనారాయణరాజు, 14 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఆక్వా సమస్యలను అధిగమిస్తాం



మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

భీమవరం: అమెరికా ఆంక్షల కారణంగా రొయ్యల రైతులకు ఏర్పడిన ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అనువైన చర్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ తెలిపారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ సీహెచ్ నాగరాణితో కలిసి ఆయన సమీక్షించారు. అనంతరం దినకర్ విలేకరులతో మాట్లాడుతూ అమెరికా ఆంక్షల నేపథ్యంలో కొనుగోలుదారులు సిండికేట్‌గా మారి అన్నిరకాల కౌంట్ రొయ్యల ధరలు తగ్గించారనే విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకునేలా కృషిచేస్తానన్నారు. ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్ అమలు, గ్రామీణ సడక్ యోజన, లాక్‌పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎం సూర్యఘర్, పీఎం ఆవాస్ యోజన, పీఎం విశ్వకర్మ యోజన వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్షించామన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీపీఓ కె.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జేడీ జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షోభంలో సాగు

అన్నదాతకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి.. ఆరుగాలం శ్రమించినా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.. పంట దిగుబడులు రాక.. గిట్టుబాటు ధరలు లేక.. సిండికేట్‌ల మాయాజాలం.. అంతర్జాతీయ పరిణామాలు రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మద్దతు ధరల కోసం రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నా కూటమి సర్కారుకు పట్టడం లేదు. రైతులకు నామమాత్రపు సాయం కూడా అందడం లేదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రొయ్యలు, కోకో, మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అన్నదాత.. గుండెకోత

- ఆర్థిక గండాలతో సతమతం
- ట్రంప్ దెబ్బకు రొయ్యల ధరలు పతనం
- గిట్టుబాటు ధర కోసం కోకో రైతుల ఆందోళన
- మామిడి తోటల్లో తగ్గిన దిగుబడి
- ఆక్వాలో క్రాప్ హాలిడే దిశగా అడుగులు
- ఆదుకోని కూటమి సర్కారు



సాక్షి ప్రతినిధి, ఏలూరు : వాణిజ్య పంటలు, ఆక్వాకు రాష్ట్రంలోనే ఖ్యాతి గాంచిన జిల్లాలో మద్దతు ధర కోసం రైతులతో పాటు ఆక్వా సాగుదారులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా జిల్లాలో 60 శాతానికిపైగా కోకో ధరలు పతనం కావడం, ఆక్వా ధరలు పూర్తిగా తగ్గిపోవడం, మామిడి దిగుబడి లేకపోవడం వంటి ప్రధాన సమస్యలతో లక్షలాది మంది రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు మొదలు లోకేష్ వరకూ జిల్లాను ఆక్వా హబ్‌గా మారుస్తాం, కోకో సాగుకు మహర్దశ తీసుకువస్తాం, మామిడి ప్రాసెసింగ్ యూనిట్లతో మామిడి హబ్‌గా మారుస్తామని హామీలిచ్చారు. తీరా గద్దెనెక్కిన తర్వాత వీటి ఊసే ఎత్తడం లేదు. శుక్రవారం నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్న క్రమంలో అన్నదాతలకు ఇచ్చిన హామీలపై అంతటా చర్చ జరుగుతోంది.

గత ప్రభుత్వంలో రూ.1,830 కోట్ల పెట్టుబడి సాయం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరితో పాటు వాణిజ్య పంటలు ఆక్వా, మత్స్య సాగు అధికంగా ఉంది. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్, కోకో, పొగాకు వంటి వాణిజ్య పంటలు పండిస్తున్నారు. పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ఇక్కడ వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పథకం కింద జిల్లాలో 2,35,847 మంది రైతులకు రూ.1,830.24 కోట్ల పెట్టుబడి సాయం కింద అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా అన్నదాత సుఖీభవ పథకం అమలు కాని పరిస్థితి.

కోలుకోని కోకో

జిల్లాలో కోకో సాగు 36,150 ఎకరాలు విస్తరించి ఉంది. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణం ఉన్న జిల్లాగా ఖ్యాతి గాంచింది. ఏటా జిల్లాలో 12 వేల టన్నుల కోకో గింజల దిగుబడి ఉంది. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో కిలోకు అత్యధికంగా రూ.1,050 ధర పలకగా ప్రస్తుతం రూ.500కి చేరింది. అంతర్జాతీయంగా కోకోకు మంచి డిమాండ్ ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యత, ఇతర కారణాలు చూపుతూ తక్కువ ధరకు కొంటున్నారు. దీంతో రాష్ట్ర కోకో రైతుల సంఘం నెల రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తోంది. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా రైతుల రాస్తారోకోలు, 15న ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. మద్దతు ధర కల్పిస్తామని గత నెలలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించినా కనీసం స్పందన లేకపోవడంతో ఆందోళనలు తీవ్రతరం చేశారు.



మామిడి.. దిగుబడి తడబడి

ఏలూరు జిల్లాలో 45 వేల ఎకరాల్లో మామిడి సాగు విస్తరించి ఉంది. నూజివీడు మామిడి అంతర్జాతీయంగా ఖ్యాతిగాంచింది. ఈ ఏడాది డిసెంబర్, జనవరిలో పూత సమయంలో నల్ల తామర రావడంతో 70 శాతానికి పైగా దిగుబడి తగ్గిపోయింది. గతంలో మామిడి రైతులకు నష్టం వాటిల్లిన క్రమంలో ప్రభుత్వం ఆర్థిక సాయంతో ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవతో సహా ఒక్క పథకాన్ని కూడా అమలు చేయకపోవడంతో రైతులు ఆర్థిక ఊబిలో కూరుకుపోయారు. ఎన్నికల సమయంలో మామిడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాసెసింగ్ యూనిట్లు, జ్యూస్, పల్ప్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని హామీలిచ్చిన చంద్రబాబు గద్దెనెక్కాక కనీసం మామిడి సాగు స్థితిగతులపై దృష్టి సారించకపోవడం గమనార్హం.



రొయ్య 'వెల' విల

జిల్లాలోనే ఆక్వా సాగు సుమారు 2.59 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉంది. రాష్ట్రంలో అత్యధిక సాగు జరిగే జిల్లాగా ఉమ్మడి పశ్చిమ నిలిచింది. ఏటా 3 లక్షల టన్నుల రొయ్యల దిగుబడి ఉంది. ఆక్వా పరిశ్రమకు అనుబంధంగా 40కు పైగా ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. అమెరికా పన్నుల ఆంక్షలు సాకుగా చూపించి వ్యాపారులు రొయ్యల ధరలు తగ్గించారు. 100 కౌంట్ కిలో రూ.235 ఉండగా రూ.40 తగ్గించి కొంటున్నారు. నెల క్రితం 100 కౌంట్ రూ.260 పలకగా ప్రస్తుతం రూ.190కి చేరింది. దీంతో టన్నుకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు నష్టపోతున్నామంటూ ఆక్వా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాలకొల్లులో రాస్తారోకో నిర్వహించారు.



వ్యాపారుల సిండికేట్‌తో ధరలు పతనమవుతున్నాయని ప్రభుత్వం జోక్యం చేసుకుని గిట్టుబాటు ధర కల్పించాలంటూ పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో జూన్ నుంచి ఆక్వా క్రాప్ హాలిడేకు పిలుపునిచ్చారు. ఇదే బాటలో మిగిలిన నియోజకవర్గాల్లో రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆక్వా రైతుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన అప్పడా పూర్తిగా సమస్యలను విస్మరించడంతో పాటు షెడ్యూల్ ప్రకారం జిల్లాలో జరగాల్సిన రైతుల సదస్సులను గాలికి వదిలేసింది.

సత్తాలలో ఉపాధి సిత్రాలు

- దొంగ మస్తర్ల దందా
- బోగస్ హాజరుతో వేతన నిధులు స్వాహా!
- కూటమి నేతల అండతో అక్రమాలు

ద్వారకాతిరుమల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. పనిలోకి వెళ్లని వారి పేరున మస్తర్లు వేసి కొందరు సిబ్బంది సొమ్ములు స్వాహా చేస్తున్నారు. ద్వారకాతిరుమల మండలం సత్తాల పంచాయతీలో జరుగుతున్న పనులు ఇందుకు నిదర్శనంగా ఉన్నాయి. గ్రామంలో రెండు ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం 80 నుంచి 90 మంది కూలీలు పనిచేస్తున్నట్టు మస్తర్లు వేస్తున్నారు. వాస్తవానికి పనిలోకి వెళ్లని కొందరు కూలీలకు సైతం మస్తరు పడుతున్నాయి. కూటమి నేతల అండతోనే ఉపాధి హామీ సిబ్బంది ఈ అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దొంగ మస్తర్లు వేస్తోందిలా..

రోజూ పనిచేసిన కూలీలను గ్రూప్ ఫొటో తీసి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతలను నిర్వహిస్తున్న మేట్ నరెడ్ల శ్యామలాదేవి ఫొటోలో ఉన్న వారికంటే ఎక్కువ మందికి మస్తర్లు వేస్తున్నారు. ఈనెల 8న ఇందేటి నాగమణి అనే కూలి ఒక్కరే ఉన్న ఫొటోను అప్‌లోడ్ చేసి ఆమెతో పాటు, నరెడ్ల సుబ్బారావుకు కూడా మస్తర్ వేశారు. అలాగే 9న బాలుడు గొన్నూరి కార్తీక్ ఫొటో అప్‌లోడ్ చేసి వృద్ధుడు నరెడ్ల సుబ్బారావుకు మస్తర్ వేశారు. అదే రోజు ముగ్గురున్న ఒక ఫొటోను అప్‌లోడ్ చేసి ఆరుగురికి మస్తర్లు వేశారు.

ద్వారకాతిరుమల మండలం సత్తాల పంచాయతీ సంద్రకుంట గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడు గొన్నూరి కార్తీక్ ఈనెల 9న ఉపాధి హామీ పనులకు వెళ్లినట్టు అతడి ఫొటోను సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే పేరు మాత్రం 79 ఏళ్ల వయసున్న నరెడ్ల సుబ్బారావుగా చూపారు. బాలుడు కార్తీక్‌తో ఉపాధి పనులు చేయించి సుబ్బారావుకు మస్తర్ వేశారా, లేక పనిలోకి వెళ్లని సుబ్బారావుకు మస్తర్ వేసేందుకు కార్తీక్ ఫొటోను వాడుకున్నారా అన్న ప్రశ్నలకు ఉపాధి హామీ అధికారులే సమాధానం చెప్పాలి.



బాలుడు కార్తీక్ ఫొటో పెట్టి, వృద్ధుడు సుబ్బారావు పేరున వేసిన మస్తర్ ఆన్‌లైన్ స్టేటస్



ఫొటోలో ఉంది ముగ్గురే.. మస్తర్లు మాత్రం ఆరుగురికి..

అలాగే బుధవారం ఇందేటి నాగమణి ఒక్కరే ఉన్న ఫొటోను అప్‌లోడ్ చేసి, ఆమెతో పాటు నరెడ్ల సుబ్బారావుకు, అలాగే ముగ్గురున్న మరో ఫొటోను అప్‌లోడ్ చేసి ఆరుగురికి మస్తర్లు వేశారు.

పని అక్కడ.. మస్తర్లు ఇక్కడ : పేరమ్మ (మేరెమ్మ) దూబచర్లలో జీడిగింజల ఫ్యాక్టరీలో పనిచేస్తోందని స్థానికులు చెబుతున్నారు. సుబ్బమ్మ ఇంటి వద్దే ఉంటోందని, మమత వ్యవసాయ పనులకు వెళుతోందని అయినా వారికి మస్తర్లు వేస్తున్నారని అంటున్నారు. ఇలా దొంగ మస్తర్లు వేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

విచారణ చేస్తాం

దీనిపై ఉపాధి హామీ ఏపీఓ బిరుదుగడ్డ నాగరాజును వివరణ కోరగా సత్తాల పంచాయతీలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన మస్తర్లలో అవకతవకలు జరుగుతున్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ చేస్తామని చెప్పారు.

కైకలూరు ఏఎంసీలో కయ్యాలు

- చైర్మన్ పదవి కోసం ఆశావహుల యత్నాలు
- కైకలూరు ఓసీ, కలిదిండి ఎస్సీ మహిళ రిజర్వేషన్లకు పట్టు
- ఏఎంసీ చైర్మన్లను ప్రకటించని ప్రభుత్వం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ల ఎంపిక కైకలూరు నియోజకవర్గంలో కయ్యాలకు కారణమవుతోంది. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పదవి తర్వాత రెండో స్థానంగా కైకలూరు, కలిదిండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవులను భావిస్తారు. రాష్ట్రంలో కైకలూరు ఏఎంసీ ఆదాయంలో మొదటి స్థానంలో నిలవగా.. రాష్ట్ర జీడీపీలో కలిదిండి మండలం మొదటి స్థానంలో ఉంది. దీంతో ఈ రెండు ఏఎంసీ చైర్మన్ల పదవుల కోసం కూటమి పార్టీల్లో పోటీ తీవ్రంగా ఉంది. ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతల్లో ఏఎంసీ చైర్మన్లను ప్రకటించినా కైకలూరు, కలిదిండి ప్రస్తావన లేదు. దీంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

రిజర్వేషన్ల చిచ్చు

ఏఎంసీ చైర్మన్ల రిజర్వేషన్ల కేటాయింపులో మతలబు జరిగిందనే భావన కూటమి నేతల్లో నెలకొంది. మొదట్లో కైకలూరు ఏఎంసీ బీసీ కోటాలో టీడీపీ నాయకుడు పూలా రాజీ సతీమణికి, కలిదిండి ఏఎంసీ చైర్మన్ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోకల జోగిరాజుకు కేటాయించినట్టు ప్రచారం జరిగింది. అయినా ఎమ్మెల్యే కామినేని మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. ఇదిలా ఉండగా కైకలూరు ఏఎంసీ పదవిని పెన్మత్స త్రినాథరాజు, గంగుల శ్రీదేవి, బూరుబోయిన శ్రీనివాసరావు, తెంటు వెంకటరమణ, కలిదిండి నుంచి జనసేన నేత చలపతి, అంద్రాజు శ్రీనివాసరావు ఆశించారు. తాజాగా కైకలూరు ఏఎంసీ ఓసీ, కలిదిండి ఏఎంసీ ఎస్సీ మహిళకు కేటాయించాలని నిర్ణయించినట్టు, అధిష్టానం వద్ద ఇవే రిజర్వేషన్లు ఉంటే రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేశారని ఆశావహులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ బోర్డు

పలువురు బరిలో..

కైకలూరు ఏఎంసీ చైర్మన్ రిజర్వేషన్ ఓసీగా మారిస్తే టీడీపీ మండలాధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు మొదటి వరుసలో ఉన్నారు. అలాగే కేవీఎస్ఎం నాయుడు, పుప్పాల సూర్యప్రకాశరావు పోటీపడుతున్నారు. కలిదిండి ఏఎంసీ ఎస్సీ మహిళా రిజర్వేషన్‌గా మారితే ముదినేపల్లి మండలానికి చెందిన పంతగాని సురేష్ కుటుంబం, కోరుకొల్లు పంచాయతీ సర్పంచ్ బట్టు లీలాకనకదుర్గ (జనసేన) పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే కలిదిండిని జనసేనకు కేటాయిస్తే చలపతికి వస్తుందనే ప్రచారం కూడా ఉంది. కైకలూరు ఏఎంసీ బీసీ మహిళా కోటాలో తెంటు వెంకటరమణ బరిలో ఉన్నారు.

ఎమ్మెల్యే నాయకర్ వ్యాఖ్యలపై మండిపాటు

నరసాపురం: నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సమక్షంలో నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత పెండ్ర వీరన్న మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయకర్ రౌడీయిజంలో కాకుండా, నియోజకవర్గ అభివృద్ధిలో తన టాలెంట్ చూపించాలని హితవు పలికారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి ఓ బీసీ సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రిపై దుర్భాషలాడటం దారుణమన్నారు. నాయకర్ తీరుతో కూటమిలోని పార్టీలు, కార్యకర్తలకే నష్టమన్నారు. నియోజకవర్గంలో బీసీ రుణాలు కూటమి నాయకులు, కార్యకర్తలకు దక్కుతున్నాయని, నిష్పక్షపాతంగా అర్హులకు ఒక్కరికి రుణం ఇచ్చామని ఎమ్మెల్యే ధైర్యంగా చెప్పగలరా? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై ఎమ్మెల్యే మాట్లాడాలి గానీ బహిరంగ సభల్లో బూతులతో బెదింపులకు దిగడం ఏంటని ధ్వజమెత్తారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న

నియోజకవర్గ చరిత్రలో నాయకర్ మాత్రమే..

నరసాపురం నియోజకవర్గ చరిత్రలో ఎందరో మంత్రులుగా, కేబినెట్ హోదాల్లో పనిచేశారని, ఎవరూ నాయకర్‌లా నీచ సంస్కృతి జోలిక పోలేదని వీరన్న అన్నారు. రౌడీయిజం, బూతులు, బెదిరింపుల్లో నాయకర్ మొదటి ఎమ్మెల్యేగా నిలిచారని, ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, కౌన్సిలర్ యర్రా శ్రీను, నాయకులు బర్రి శంకరం, అడ్డాల నర్సింహరావు, కూనపరెడ్డి నారాయణ, నిప్పులేటి సత్యనారాయణ, మురాల చిన్న, కడలి అబద్దం, పెదశింగు శంకరం పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవి స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ ప్రోగామ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. తొలి విడత ఈనెల 28న, రెండో విడత మే 12న ప్రారంభించనున్నట్టు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి చెందిన 3, 4 సంవత్సరాల ఇంజినీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మామిడికి అకాల నష్టం

- ఈదురుగాలులతో నేలరాలిన కాయలు
- అకాల వర్షంతో అవస్థలు
- లబోదిబోమంటున్న రైతులు

నూజివీడు: ప్రకృతి ప్రకోపం మామిడి రైతుల ఆశలను వమ్ము చేసింది. అసలే కాపు తక్కువ ఉండి నష్టాల్లో ఉన్న రైతులను పెనుగాలుల రూపంలో ప్రకృతి మరింత అప్పుల్లోకి నెట్టేసింది. ఈనెల 7న సాయంత్రం ఈదురు గాలులు, అకాల వర్షం మామిడికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. నూజివీడు నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పండ్ల తోటల్లో మామిడి ప్రాధాన్యమైంది. ఈ ఏడాది దాదాపు 80 శాతం దిగుబడి తగ్గి రైతులు దిగాలుగా ఉండగా.. పెనుగాలులు మరిన్ని కష్టాలను తెచ్చిపెట్టాయి. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి దిగుబడి కోసం ఎదురుచూస్తున్న సమయంలో పంట వర్షార్పణం అయ్యింది.

15 శాతం వరకు పంటకు దెబ్బ

నూజివీడు నియోజకవర్గంలోని చాట్రాయి, ముసునూరు మండలాల్లో వీచిన ఈదురుగాలులకు మామిడి కాయలు నేలపాలయ్యాయి. తోటల్లో దాదాపు 10 నుంచి 15 శాతం మామిడి కాయలు రాలిపోయాయి. చాట్రాయి మండలంలోని కొత్తగూడెం, యర్రావారిగూడెం, సి.గుడిపాడు, నరసింహరావుపాలెం, చిన్నంపేట తదితర గ్రామాల్లో, ముసునూరు మండలంలోని రమణక్కపేట, లోపూడి, సూరేపల్లి, బాస్వరప్పాడు గ్రామాల్లో ఈదురుగాలులు వీచాయి. రాలిన కాయలను విక్రయిద్దామన్నా ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో వాటిని పారబోయాల్సిన పరిస్థితి రైతులకు ఎదురైంది. చాట్రాయి మండలంలో 4,232 ఎకరాల విస్తీర్ణంలో మామిడి సాగు చేస్తుండగా సుమారు 30 టన్నుల కాయలు నేలరాలాయి. అలాగే ముసునూరు మండంలలో 3,100 ఎకరాల విస్తీర్ణంగా సాగు చేస్తుండగా సుమారు 15 టన్నుల కాయలు నేలరాలాయి.



చాట్రాయి మండలంలో ఈదురుగాలులకు నేలరాలిన మామిడి కాయలు

పూతను కాపాడుకుంటే...

పూతను నిలుపుకునేందుకు 12 నుంచి 15 సార్లు పురుగు మందులను రైతులు పిచికారీ చేశారు. నల్ల తామర పురుగు ఉధృతంగా ఉన్నప్పుడు కూడా పూతను కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు. పురుగు మందులు, తోట కాపలా, నీటితడులు కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టామని, దిగుబడులు చేతికి వచ్చే సమయానికి పెనుగాలుల తాకిడికి కాయలు నేలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకు రెండెకరాల్లో మామిడి తోట ఉంది. ఇప్పటివరకు రూ. లక్షకు పైగా ఖర్చుచేశా. పూత వచ్చి పిందెలు ఏర్పడ్డాయని సంతోషించే లోపు ఈదురుగాలులకు కాయలు రాలిపోయాయి. దీంతో దాదాపు రూ.40 వేల నష్టం వాటిల్లింది. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– మండపాటి రఘుపతిరెడ్డి, రైతు, సి.గుడిపాడు, చాట్రాయి మండలం

తీవ్రంగా నష్టపోయాం



నాకు పది ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. రూ.10 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. ఈదురుగాలులు, వర్షానికి మామిడి కాయలు రాలిపోయి తీవ్రంగా నష్టం వాటిల్లింది. పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో మామిడి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కొండా వెంకట్రావు, రైతు, రమణక్కపేట, ముసునూరు మండలం

క్లుప్తంగా

హాస్టల్ గదిలో ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

భీమవరం: పట్టణంలోని విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్న పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన యు.స్వర్ణకుమారి (19) కళాశాల హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్వర్ణకుమారి గురువారం తరగతులకు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉండి తన స్నేహితుడికి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఫోన్ చేసి చెప్పింది. వెంటనే అతడు కళాశాలలోని తన స్నేహితులకు చెప్పడంతో హాస్టల్ గదికి వెళ్లేసరికి స్వర్ణకుమారి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేళ్లాడుతూ కనిపించింది. హుటాహుటిన చికిత్స కోసం ప్రవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే ఆమె స్నేహితులతో టూర్ వెళ్లడానికి ప్లాన్ చేసుకోగా తల్లిదండ్రులు నిరాకరించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్నారు. అయితే దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై రూరల్ సీఐ బి.శ్రీనివాసరావును వివరణ కోరగా ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నేషనల్ క్రికెట్ టీంకు క్రీడాకారుడి ఎంపిక


షేక్ సమీరుద్దీన్

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణం బ్రాడీపేట ప్రాంతానికి చెందిన షేక్ సమీరుద్దీన్ నేషనల్ క్రికెట్ టీంకు సెలెక్ట్ అయ్యాడు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఇండో–నేపాల్ కప్ చాంపియన్‌షిప్–2025 క్రికెట్ టోర్నమెంట్‌కు ఇండియా తరపున ఆడేందుకు నైన్ ఏ సైడ్ క్రికెట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ సంస్థ నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు వచ్చినట్లు సమీరుద్దీన్ తెలిపాడు. ఈ టోర్నమెంట్ మే 26 నుంచి 31 వరకూ నేపాల్‌లో ఆరురోజుల పాటు జరుగుతుందని పేర్కొన్నారు. తాను ప్రస్తుతం చైతన్య కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్నాని పేర్కొన్నారు. అలాగే పీడీ రామకృష్ణ, మణికంఠల శిక్షణలో తర్ఫీదు పొందుతున్నానని వివరించాడు. త్వరలో క్రికెట్ అకాడమీకి పిలుస్తామని సిద్ధంగా ఉండాలని నైన్ ఏ సైడ్ సంస్థ సభ్యులు సమాచారం ఇచ్చినట్లు సమీరుద్దీన్ తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన కంఠం సాయితరుణ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ చాటుతున్నాడని శిక్షకుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు బదిరెడ్డి రామ్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1న బైలాస్పూర్‌లో ఇండియన్ బాడీబిల్డింగ్ ఫెడరేషన్ నిర్వహించిన జూనియర్ మిస్టర్ ఇండియా చాంపియన్‌షిప్ పోటీల్లో 80 కేజీల విభాగంలో తృతీయస్థానం సాధించాడని వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం భీమవరంలో జరిగిన మిస్టర్ ఆంధ్ర పోటీల్లో సైతం చాంపియన్స్ ఆఫ్ ది చాంపియన్స్‌గా నిలిచి ఓవరాల్ టైటిల్ కైవసం చేజిక్కించుకున్నాడని హర్షం వ్యక్తం చేశారు.

వేతన యాతన తీరేదెప్పుడు..?

- ప్రభుత్వాస్పత్రుల్లో కార్మికులకు నెలల తరబడి వేతనాల పెండింగ్
- అప్పులు చేసి బతుకుతున్నామంటూ ఆవేదన


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులు

తణుకు అర్బన్: ప్రభుత్వాస్పత్రుల్లో సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలివ్వడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుంది. నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు చేసే వారి ఇళ్లు ఆకలికేకలతో అల్లాడుతున్నాయి. శుభ్రత, భద్రత, క్షేమంగా ఇంటికి చేర్చే రంగాల్లో వారు సేవలు అమోఘంగా చేస్తున్నా సరైన సమయానికి వేతనాలు అందించడం లేదని కార్మికులు వాపోతున్నారు.తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ విభాగం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా గతం నుంచి రోగులకు సత్వర సేవలందుతున్నాయి. కానీ నేడు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్య కార్మికులకు 3 నెలలు, సెక్యూరిటీ విభాగం 2 నెలలు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు రెండు నెలలు జీతం పెండింగ్‌లో ఉండడంతో కుటుంబాలను పోషించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

కుదిరితే అప్పులు..లేకపోతే పస్తులు

జీతం రాకపోయినా ఖర్చులు తప్పవు అనే ఉద్దేశంతో ఇళ్లు గడిపేందుకు అప్పులు చేస్తున్నామంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో వచ్చే వ్యర్థాలతోపాటు వివిధ వార్డుల్లో వచ్చే వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా పనిచేస్తుంటారు. రక్తపు వ్యర్థాల తొలగింపులో రోగాలబారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లోనే విధుల్లో ఉండాల్సి వస్తుందని అయినప్పటికీ ఏ నెల వేతనం ఆ నెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు రోగుల రక్షణ, భద్రతలో కీలకంగా ఉంటారు. రోగులు ఇబ్బందులు పడకుండా క్యూలైన్‌లో పంపించడంతోపాటు ఎలాంటి ఘర్షణలు జరిగినా సర్దుబాటు చేయడంలోను ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. లోపలకు వచ్చేవారితోపాటు బయటకు వెళ్లేవారిని గమనిస్తూ ఎటువంటి చోరీలు జరగకుండా చూస్తుంటారు.

జిల్లాలో ప్రభుత్వాస్పత్రిలో కార్మికులు	
విభాగం	కార్మికుల సంఖ్య
పారిశుధ్యం	152
సెక్యూరిటీ	110
తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు	14


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల్లో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

అప్పులతో కాలం గడుపుతున్నారు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ వేతనం కూడా ఏ నెల వేతనం ఆ నెలలో ఇవ్వకుండా నెలలపాటు బకాయిలు పెట్టి వారిని అప్పులపాలు చేస్తున్నారు. కార్మికుల ఆకలికేకలు పట్టించుకోని ప్రభుత్వాలు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– కోనాల భీమారావు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు

క్షేమంగా ఇంటికి చేర్చినా..

ఆస్పత్రిలో ప్రసవాల అనంతరం తల్లి, బిడ్డను క్షేమంగా వారి ఇంటికి చేర్చడంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు సత్వర సేవలు అందిస్తుంటారు. అరకొర వేతనంతోనే విధులు నిర్వర్తిస్తూ బాలింతలను సురక్షితంగా ఇంటికి చేరుస్తూ వారి ప్రశంసలు పొందుతున్నారు. గత ఐదేళ్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడిచిన ఈ సేవలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి వారి జీవనోపాధి కుంటుపడిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి ఆయా కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పీజీ సెంటర్‌లో కూలుతున్న అకడమిక్ బ్లాక్ భవనం


నూజివీడులోని పీజీ కేంద్రంలో కూలిన అకడమిక్ భవనం శ్లాబు

నూజివీడు: పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీకి చెందిన పీజీ కేంద్రంలోని అకడమిక్ బ్లాక్ భవనం ద్వితీయ అంతస్తు స్లాబు బుధవారం కూలిపోయింది. ఈ సమయంలో పైన పెద్ద శబ్దం రావడంతో కింది అంతస్తులో ఉన్న అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురై భవనంపై నుంచి కిందకు పరుగులు తీశారు. ఈ అంతస్తు కూలిపోవడానికి సిద్ధంగా ఉండడంతో గత ఏడాది కాలంగా ఈ భవనంలోని గదుల్లో తరగతులు నిర్వహించడం లేదు. దానంతట అదే కూలిపోక ముందే, ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే ఈ భవనంపై అంతస్తును కూల్చేయాలని పీజీ సెంటర్‌లోని అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పలుమార్లు యూనివర్శిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఏమాత్రం స్పందించడం లేదు. గత నెలలో పీజీ కేంద్రాన్ని సందర్శించిన కృష్ణా యూనివర్శిటీ వీసీ ఆచార్య కూన రాంజీ దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఇప్పటికైనా పై అంతస్తును కూల్చివేయాలని పీజీ కేంద్రం విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

శుభలేఖలు పంచి వస్తూ..

అనంతలోకాలకు

రోడ్డు ప్రమాదంలో బావ, బావమరిది మృతి


ప్రమాద స్థలంలో అప్పారావు మృతదేహం

దెందులూరు: మండలంలోని కొమిరేపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఈ సంఘటనకు సంబంధించి దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం అనంతపల్లి గ్రామానికి చెందిన గురుమిల్లి అప్పారావు, నిడమర్రు గ్రామానికి చెందిన పతివాడ బాపన్న వరుసకు బావ, బావమరిదిలు. వీరు బాపన్న కుమారుడు వివాహ శుభలేఖలు ఇవ్వడానికి బైక్‌పై దెందులూరు వచ్చారు. శుభలేఖలు ఇచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా కొమిరేపల్లి సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఓ కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గురుమిల్లి అప్పారావు(47) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ పతివాడ బాపన్న(50) ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివాజీ వివరించారు.

భగవద్గీత అనువాదం గొప్ప విషయం


భగవద్గీత లోకార్పణ ప్రారంభిస్తున్న గజల్ శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: భగవద్గీతను వంద భాషల్లో అనువాదం చేయాలనే సంకల్పం చాలా గొప్ప విషయమని రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో గజల్ శ్రీనివాస్ సంగీతం సమకూర్చి గానం చేసిన సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత (తెలుగు) లోకార్పణ కార్యక్రమం సేవ్ టెంపుల్ భారత్, సూర్య నారాయణమూర్తి దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ తండ్రి కేశిరాజు నరసింహరావు చేతులు మీదుగా భగవద్గీత లోకార్పణ కార్యక్రమం ఆవిష్కరించారు. ఈ సందర్భంగాగజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ భగవద్గీతను దాదాపుగా వంద భాషల్లో అనువదించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటికే 25 భాషల్లో భగవద్గీత రికార్డింగ్ పూర్తయ్యిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, అంగర రామ్మోహన్, యడ్ల తాతాజీ, కుమార దత్తాత్రేయ వర్మ, డీటీడీసీ బాబు, పెంద్ర వీరన్న, చినిమిల్లి సత్యనారాయణరావు పాల్గొన్నారు.


పోతునూరులో వరికోత యంత్రాలతో ధాన్యాన్ని సేకరిస్తున్న రైతులు


వరి కుప్ప వేయడానికి పనలు తీసుకువెళ్తున్న రైతు కూలీ

చివరిలో కలవరం

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికందుతుందో? లేదో? అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నాట్లు వేసిన దగ్గర నుంచి ధాన్యం మిల్లుకు వెళ్లే వరకు రైతన్నలు పడే కష్టాలు అంతా ఇంతా కాదు. ప్రస్తుత రబీ సీజన్‌లో కోతలు అవుతున్న సమయంలో గత మూడు రోజుల నుంచి వాతావరణం మార్పు వల్ల ఎప్పుడు ఏ గాలివాన వస్తుందో? పండించిన పంట చేతికందదేమో? అని రైతులు పొలాల్లో పడిగాపులు కాస్తున్నారు. పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో కోసిన ధాన్యాన్ని ఏం చేయాలో? తెలియక రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. చాలా ప్రాంతాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకుని గోనె సంచుల కోసం ఎదురుచూస్తున్నారు. దెందులూరు మండలం పాలగూడెం, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో రైతులుపడుతున్న అవస్థలు ఇవీ..

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు


కొవ్వలిలో రోడ్డుపై ధాన్యం ఎగురబోస్తున్న రైతులు


పోతునూరు రోడ్డులో ధాన్యాన్ని రాశులుగా పోసి బరకంతో కప్పి ఉంచిన దృశ్యం

ఉరదాళ్లపాలెంలో వ్యక్తి అనుమానాస్పద మృతి

అత్తిలి: ఉరదాళ్లపాలెం గ్రామంలో హరిజన పేటకు చెందిన వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన కలకలం రేపింది. గ్రామంలోని లేఅవుట్ ప్రాంతంలో గురువారం ఉదయం యడ్ల శ్రీనివాసరావు (30) అనే వ్యక్తి ఒంటిపై గాయాలతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు తెలిపిన వివరాల ప్రకారం ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన యడ్ల శ్రీనివాసరావు, అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామానికి చెందిన యడ్ల గంగమ్మతో రెండేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఆమె కొంతకాలంగా పుట్టింటి వద్దే ఉండటంతో భర్త శ్రీనివాసరావు కూడా ఇక్కడే ఉంటూ కాంక్రీటు పనులకు వెళుతున్నాడు. ఈనెల 9వ తేదీన తెల్లవారు జామున కాంక్రీటు పనికి వెళ్లి, రాత్రివరకు ఇంటికి రాలేదు. దీంతో భార్య బంటామేస్త్రికి ఫోన్‌చేసి అడగగా లేటు అవుతుంది..వస్తాడు.. అని చెప్పాడు. అయితే గురువారం ఉదయం లేఅవుట్ ప్రాంతంలో శ్రీనివాసరావు మృతి చెందినట్లు గుర్తించారు. అయితే పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమేరాల ఫుటేజిని పరిశీలించగా బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో లేఅవుట్ ప్రాంతంలోని ఓ లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా వెనుకకు బ్యాక్ చేస్తూ రోడ్డుమార్జిన్‌లో ఉన్న శ్రీనివాసరావును ఢీకొట్టినట్లు గుర్తించారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య యడ్ల గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రేమరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

గణపవరం: మండలంలోని జల్లికొమ్మర వద్ద టిప్పర్ లారీ ఢీ కొనడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గణపవరం ఎస్సై ఆకుల మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం పదిగంటల సమయంలో రాజమండ్రి రూరల్‌కు చెందిన కట్టా సుబ్రహ్మణ్యం(37) అనే యువకుడు గ్లామర్ మోటార్ సైకిల్‌పై వస్తుండగా జల్లికొమ్మర గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మరణించాడు. లారీ డ్రైవర్ పరారీలోఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికుమార్ తెలిపారు.

బోడపాడులో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

పెంటపాడు: పెంటపాడు శివారు బోడపాడు ఆర్చ్ వద్ద గురువారం తెల్లవారు జామున జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. వీఆర్వో ప్రశాంతి, ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం–భీమవరం రాష్ట్ర రహదారిలో బోడపాడు ఆర్చ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉండడం గుర్తించామన్నారు. గూడెం నుంచి పిప్పర వైపు వెళ్లే భారీ వాహనం ఇతనిని ఢీకొట్టి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని గూడెం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, బంధువుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి


చిట్లూరి ప్రవీణ్ మృతదేహం

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం మలుపులో నిర్మాణంలో ఉన్న నూతన బిల్డింగ్‌లో టైల్స్ వేసే పనికి వెళ్లిన 17 ఏళ్ల బాలుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక అజరయ్యపేటకు చెందిన చిట్లూరి ప్రవీణ్ (17) తొమ్మిదో తరగతి వరకు చదువుకొని ఆ తరువాత తన తండ్రికి పనుల్లో సాయంగా వంట పనికి వెళ్తుంటాడు. వంట పని లేనిప్పుడు కూలి పనులకు వెళ్తూ ఉంటాడు. దీనిలో భాగంగా నూతన బిల్డింగ్‌లో టైల్స్ వేసే పనికి మేస్త్రీతో పాటు వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా ఉదయం 10 గంటల సమయంలో సున్నం బస్తాను తీసుకుని అక్కడే ఉన్న ఐరన్ గ్రిల్స్‌పై కాలు వేయగానే గిలాగిలా కొట్టుకొంటూ కిందపడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న మేస్త్రీ లాగు శ్రీను బాలుడిని పట్టుకోగా అతను పెద్దగా కేకలు వేస్తూ గిలాగిలా కొట్టుకుంటున్నాడు. ఇదే సమయంలో సమీపంలో ఉన్న ఆటో డ్రైవర్ అతను కేకలు విని చూసి పరిగెత్తుకొని వచ్చి కరెంటు బోర్డులో ఉన్న విద్యుత్ తీగను తప్పించాడు. ఈ తీగకు ఉన్న అతుకులు తొలగి ఐరన్ గ్రిల్స్‌కు ఆనడం వల్ల గ్రీల్స్‌కు కరెంటు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. అనంతరం లాగు శ్రీనుని, ప్రవీణ్‌లను సమీపంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. షాక్‌కు గురైన మేస్త్రీ లాగు శ్రీను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో అజరయ్యపేటలో తీవ్ర విషాదం నెలకొంది.

చెరువు గట్టుపై చెట్లు అమ్మేశారని ఫిర్యాదు


నారప్ప చెరువు గట్టుపై ఉన్న చెట్టు మాను

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెంలో నారప్ప చెరువు గట్టుపై ఉన్న ఎన్నో ఏళ్ల నాటి చెట్లను కొందరు అక్రమార్కులు నరికివేసి, అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. దీనిపై భీమడోలుకు చెందిన ఆర్‌టీఐ కార్యకర్త కొత్తపల్లి చంద్రమౌళి గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక నారప్ప చెరువు గట్టుపై ఉన్న దశాబ్దాల కాలం నాటి 15 చెట్లను కొందరు వ్యక్తులు వారం రోజుల క్రితం అక్రమంగా నరికివేసి, పంగిడిగూడేనికి చెందిన ఒక వ్యక్తికి రూ. 2.80 లక్షలకు విక్రయించినట్టు చంద్రమౌళి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదంతా ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు, నీటి సంఘం అధ్యక్షుడికి తెలిసే జరిగిందని ఆరోపించారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి నాగదేవిని వివరణ కోరగా ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్టు చెప్పారు. చెట్లు నరికి చాలా రోజులు అయినట్టుగా ఆనవాళ్లు ఉన్నాయని, ఆరు చెట్టు కొమ్మలు మాత్రమే అక్కడ ఉన్నట్టు గుర్తించామన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరాలు

కై కలూరు: దొంగతనం జరిగిన 48 గంటల్లో సీసీ కెమెరాల ఆధారంగా హుండీల దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్సై వి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామవరం ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 6న రాత్రి గణపవరం మండలం మలపరాజుగూడెంకు చెందిన ముద్దుర్తి గణేష్ (20) హుండీలో రూ.8000 దొంగిలించాడు. నిందితుడు ఉప్పుటేరు వద్ద పారిపోవడానికి ప్రయత్నించగా గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరాల్లో దొంగ చిత్రాలు లభ్యం కావడంతో కైకలూరు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెనుమంట్ర: మండలంలోని మార్టేరు రోడ్డులోని బ్రాహ్మణ చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సిద్ధాంతం గ్రామానికి చెందిన సతీష్ బైక్‌పై వెళ్తూ బ్రాహ్మణ చెరువు గ్రామంలో అదుపుతప్పి ఓ వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి మరణించగా సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. సతీష్‌ను రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రెయిన్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం

భీమవరం: భీమవరం రెండో పట్టణ పరిధి రాయలం డ్రెయిన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కేసు కూడా నమోదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదవేగి : గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో విజయరాయికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం విజయరాయి గ్రామానికి చెందిన కంబంపాటి రాజేంద్రప్రసాద్ ఈ నెల 9న సాయంత్రం స్థానిక నూజివీడు సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రోజువారీ పని ముగించుకుని ఇంటి వెళ్లే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో స్థానికులు రాజేంద్రప్రసాద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడి భార్య దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం



అప్పారావుపేట గ్రామంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్త సేకరణపై గురువారం ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తగా విభజించి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. తద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



తణుకు ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కూలింగ్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. తణుకు ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కార్యాలయ ప్రాంతంలో గురువారం లావణ్య ఫీడ్స్ యజమాని సతీష్ వర్మ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి సందర్భంగా ఆర్టీసీ ప్రయాణం కోసం బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దాత సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, సింగు సొల్యూషన్స్ తణుకు టీం లీడర్ సందీప్, ఆపరేటర్‌లు, హమాలీలు పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన



అత్తిలిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అత్తిలి: శ్రీరామనమి ఉత్సవాలను పురస్కరించుకుని అత్తిలి కోదండ రామాలయం వద్ద గురువారం అఖండ అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అత్తిలి: అత్తిలి గ్రామానికి చెందిన కురందాసు నాగేంద్ర అనే వ్యక్తి పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు ఎస్సై పి ప్రేమరాజు గురువారం తెలిపారు. పాలకోడేరు గ్రామానికి చెందిన నాగేంద్ర ఈనెల 7న అత్తిలిలో తన భార్యతో గొడవపడ్డాడని, ఈవిషయాన్ని ఆమె తన తల్లికి ఫోన్‌చేసి చెప్పడంతో నాగేంద్ర మనస్థానానికి గురై ఇంటివెనుకకు వెళ్లి పురుగుల మందును సేవించాడు. ఇది చూసిన భార్య వెంటనే తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

తేతలి మురుగు కాలువలో పూడిక తొలగించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

భీమవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తణుకు మండలంలో తేతలి నుంచి మండపాక మడుగు వరకు మురుగు కాలువలో పూడిక తొలగించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ 20 సూత్రాల అమలు ప్రోగ్రాం సమీక్షా సమావేశంలో చైర్మన్ లంకా దినకర్‌కు సూచించారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రవీంద్రనాథ్ పాల్గొని మాట్లాడుతూ డ్రెయిన్‌లో పూడిక తొలగింపుతో పాటు ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మాణాలు తొలగించి గట్లు నిర్మించాలన్నారు.

ఘనంగా సోమాలమ్మ జాతర

అత్తిలి: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని అత్తిలి గ్రామంలో సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఈసందర్భంగా వేలాది మందికి అఖండ అన్నసమారాధన జరిపారు. కోలాట భజన నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్పులతో అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరిపారు.

చెత్తకు నిప్పు- పర్యావరణానికి ముప్పు

- డంపింగ్ యార్డులు లేక రోడ్డు పక్కనే చెత్త కుప్పలు
- ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు



పెంటపాడు పాత పోలీస్‌స్టేషన్ స్థలం వద్ద, శ్మశానానికి వెళ్లే దారిలో చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం



దువ్వ సొసైటీ ప్రాంతంలో జాతీయ రహదారిపై చెత్తకు నిప్పుపెట్టి బస్తాలతో చెత్త వేస్తున్న దృశ్యం

పెంటపాడు: చెత్త తొలగింపుపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లోపించింది. ఏదో తూతూ మంత్రంగా పల్లెలు, పట్టణాలలో చెత్తను సేకరించి, అది ఎక్కడ వేయాలో తెలియక, వేసే దారి లేక గ్రామానికి శివారునో, లేక శ్మశానాల వద్దో, రహదారుల వెంబడో వేసి చేతులు దులుపుకొంటున్నారు అధికారులు. కూటమి ప్రభుత్వంలో అట్టహాసంగా నెలలో ఒక్క శనివారం పరిశుభ్రత, స్వచ్ఛత అని పేరుపెట్టి హడావుడి చేశారు. పాలకులకే దీనిపై శ్రద్ధ లేకపోతే అధికారులు మాత్రం ఏం చేస్తారు. అని పలు గ్రామాల ప్రజలు చెప్పుకొంటున్నారు. పంచాయతీలలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉంది. చెత్తను తరలించేందుకు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సంకల్పం రిక్షాలను మూలన పడేసారు. నేడు అవి కానరావడం లేదు. కానీ ట్రాక్టర్లు కొనుగోలు చేసామని చెప్పుకొంటున్నారు. ప్రధాన వీధులలోనే తప్ప అవి చిన్న సందులలో రాకపోవడంతో అక్కడ డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోతోంది. ప్రధానంగా పలు గ్రామాలలో వారంలో ఒక్క సారి కూడా చెత్త ట్రాక్టర్ మా వీధికి రావడం లేదని ప్రజలు చెబుతున్నారు. దీంతో పాటు డ్రెయిన్‌లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. పలు ప్రాంతాలలో డ్రెయినేజీలు తీయకపోవడం వల్ల అట్టలు కట్టి దుర్గంధం వెదజల్లుతోంది. వేసవి వచ్చినా దోమల బెడద అలానే ఉంది. చెత్తపై అవగాహన కల్పించాల్సిన అధికారులు మిన్నకుండి పోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా కానరావడం లేదు. ప్రత్యేక అధికారులు కూడా మొక్కుబడి పనులే. ప్లాస్టిక్ వాడకం నిషేధం అని చెప్పి వాటిని నిషేధం మాత్రం కానరావడం లేదు. కాగా చెత్తకు నిపుపెట్టడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాల పొగను పీల్చడం ద్వారా ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా అలంపురం జయగార్డెన్, రావిపాడు రోడ్డు, పెంటపాడు శ్మశానం, కొండేపాడులో మీన విల్లూరు రోడ్డు, కె. పెంటపాడు బంక్ ప్రాంతం తదితర ప్రాంతాలలో నిత్యం చెత్తకు నిప్పు పెడుతున్నారు. ఈ దారిన వెళ్లేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. పైగా పొగవల్ల రహదారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ టి.ఎల్.సరస్వతి



నవాబుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సింధు

తణుకు అర్బన్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే మంచి ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కృష్ణకుమారి అన్నారు. వేల్పూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా తల్లులు పోషకాహార విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం 100 రోజుల ప్రాముఖ్యత, ఊబకాయం వలన వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.దుర్గాదేవి, పి.రత్నమాణిక్యం పాల్గొన్నారు.



వేల్పూరు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న కృష్ణకుమారి

పోషకాలతోనే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రాగులు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాల్లో పోషకాలు మెండుగా ఉన్నాయని, వీటిని గర్భిణులు ఆహారంలో తీసుకోవాలని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సింధు అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో పోషకాహారంపై అవగాహన సదస్సు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సింధు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలో అందజేసే పాలు, గుడ్లు, చిక్కీలను తీసుకోవాలన్నారు. తద్వారా గర్భస్థ శిశువు బలంగా ఎదుగుతుందన్నారు. ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.తులసీ కోమలి, బి.అంబిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, పెదతాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రం కోడ్ నెం.297లోనూ పోషకాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, అంగన్‌వాడీ టీచర్లు కే.సునీత, కే.రామలక్ష్మి, టి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గర్భిణులు తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలని సీడీపీఓ టి.ఎల్.సరస్వతి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాలు సందర్భంగా గురువారం యాగర్లపల్లి 25వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యం ఉంటామన్నారు. పౌష్టికాహారం లోపంతో ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఎన్ఆర్‌సీ సెంటర్‌కు పంపించుట, తదితర విషయాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్‌కే దుర్గాభవాని, కె.విశాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సహాసిని, అంజనీ, తదితరులు పాల్గొన్నారు.

సమాచారంతో సిద్ధంగా ఉండండి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా తాడేపల్లిగూడెంలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు శుక్రవారం పట్టణానికి కేంద్ర ప్రభుత్వ అధికారులు రానున్న నేపథ్యంలో అధికారులు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కేంద్ర అధికారులు రానున్న సందర్భంగా గురువారం మునిపిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా తాడేపల్లిగూడెంలో చేపట్టిన రీ- సర్వే పైలట్ ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఐఎస్ఎఫ్ అధికారి డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి ,యశడా డైరెక్టర్ జనరల్ నిరంజన్ కుమార్ సుధాన్షు బృందం పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఈ మేరకు రికార్డులను సిద్ధంగా ఉంచాలన్నారు. రీసర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉన్న యజమానుల డిజిటలైజేషన్ ఫలితాలు త్వరితగతిన అప్డేట్ చేయాలని ఆదేశించారు. రీసర్వే జరిగిన ప్రాంతాలలో గతంలో ఉన్న సమస్యలను రికార్డులను ఆధునికీకరించడం వల్ల ఎన్ని సమస్యలు పరిష్కారమయ్యే అన్న విషయాన్ని కేంద్ర అధికారులు రైతులను అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని 23వ వార్డు, గూడెం మండలంలోని కడియద్ద, పెంటపాడు మండలంలోని కె.పెంటపాడు లలో రీ-సర్వే జరుగుతున్న ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహసీల్దార్లు ఎం .సునీల్‌కుమార్, ఎం.సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

'గూడెం'లో రాములోరి ఊరేగింపు



తాడేపల్లిగూడెం పట్టణంలో రాములోరి ఊరేగింపు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం శేషమహల్ రోడ్డులోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలో రాములోరి ఊరేగింపు జరిపారు. మాజీ కౌన్సిలర్ పట్నాల రాంపండు ఆధ్వర్యంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొని పట్టణ పురవీధుల్లో రాములోరిని ఊరేగించారు. పలువురు భక్తులు స్వామివారికి స్వాగతం పలికి పండ్లు, టెంకాయలు సమర్పించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. భక్తులు బి.ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న నారపల్లి రమణారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునర్దించాలని కోరుతూ ఈ నెల 24వ తేదీన గురువారం జరిగే ఆందోళన జయప్రదం చేయాలని రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు కార్మిక సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పసుపులేటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. రమణారావు మాట్లాడుతూ ఎన్నికలలో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునర్దురిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిందని, కార్మికులను నమ్మించి ఓట్లు వేసుకున్నారని, నేడు హామీలు అమలు చేయడం లేదని చెప్పారు. అన్ని క్లెయిమ్‌లు పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు, గూడూరు నాగేశ్వరరావు, సత్తి శ్రీనివాసరెడ్డి, వీర్రాజు, కె.వెంకటేశ్వరరావు, మాధవ, గంగారావు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోగుల పట్ల గౌరవంగా మెలగండి



ఏరియా ఆసుపత్రి అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు తదితరులు

తాడేపల్లిగూడెం: రోగుల పట్ల గౌరవంగా మెలగాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసు కోరారు. గురువారం ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ఏరియా ఆసుపత్రిలో సేవలందించాలని కోరారు. జిల్లాలో ప్రథమ స్థానంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని ఉంచాలన్నారు. అవినీతిని ఎట్టి పరిస్థితుల్లో సహించనన్నారు. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లో ఏర్పాటు చేసిన ఫిజి క్యాట్రిజ్‌లను పరిశీలించారు. కొత్త డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు పరిశీలనలో ఉన్న స్థలాన్ని చూశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తణుకు ఆర్టీసీ డిపోలో నిరసన తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

తణుకు అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ములగాల వెంకటరత్నం అన్నారు. తణుకు ఆర్టీసీ డిపో ముందు గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఉద్యోగులందరి ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్స్, అక్రమ రిమూవల్స్ ఆపాలని, పదోన్నతులు కల్పించాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం, సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలనే ప్రధాన డిమాండ్స్‌తో ఏపీపీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి బీపీఎస్ సుబ్బారావు, గ్యారేజ్ కార్యదర్శి కె.దుర్గారావు ఆధ్వర్యంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు భేష్



తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కౌట్, గైడ్, ఎన్‌సీసీ, నేవీ విద్యార్థులతో హెచ్ఎం

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని తణుకు మండల విద్యాశాఖాధికారి జీబీవీ ప్రసాద్ అన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం కోసం వేలకువేలు ఫీజులు చెల్లించేకంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యా బోధనతోపాటు సౌకర్యాలను సరిచూసుకోవాలని కోరారు. ఈ పాఠశాలలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, విద్యార్థులు వివిధ విద్యాంశాలతోపాటు క్రీడల్లోను ముందువరుసలో ఉండడాన్ని గమనించాలని కోరారు. అనంతరం ప్రపంచ సహోదర దినోత్సవం సందర్భంగా స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం సోదర, సోదరీమణుల ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు.అంతర్జాతీయ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన డాక్టర్ చాపరాల కృష్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్‌సీసీ, నేవీ, స్కౌట్స్, గైడ్స్ దళాల ప్రదర్శనలు అలరించాయి.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి కాలంలో మండుటెండలలో దాహార్తులకు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ తెలిపారు. అసోసియేషన్ భవనం వద్ద గురువారం చలివేంద్రంను సబ్ ట్రెజరీ ఆఫీసర్ పి.జయదత్తేశ్వరరావు ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ తాలూకా సెంటర్‌కు వచ్చే వారికి, వివిధ కార్యాలయాలలో ఆయా పనులు నిమిత్తం వచ్చే వారికి ఈ మజ్జిగ చలివేంద్రం ఎంతో ఉపయుక్తం అన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

పెంటపాడు: వజ్రాయుదం లాంటి సమాచార హక్కు చట్టంపై ప్రతీవారు అవగాహన పొందేలా చూడాలని గూడెంకు చెందిన డిప్యూటీ తహసీల్దార్ ఎస్. జయలక్ష్మి కోరారు. గురువారం పెంటపాడు మండల సమావేశ మందిరంలో ఎంపీడీవో సీహెచ్ బాలాజీ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు, ఎంపీడీవో బాలాజీ మట్లాడుతూ ఈ చట్టం వల్ల అన్ని రంగాలలో పారదర్శకంగా పనులు చేసేందుకు వీలవుతుందన్నారు.

12న ఎస్సీ వర్గీకరణపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆకివీడులో ఈ నెల 12వ తేదీన శనివారం ఎస్సీ వర్గీకరణ, మాలల హక్కుల అవగాహన సదస్సు జరుగుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ సదస్సుకు మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవి ప్రసాద్ హాజరవుతారని చెప్పారు. మాలలు సంఘటితంగా ఉంటూ హక్కులు సాధనకు ఉద్యమించాలన్నారు. మంద కృష్ణ మాదిగ మనువాదులతో చేతులు కలిపి మాలలపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు



గాయాలపాలైన మహిళకు సపర్యలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు సెంటర్‌లో మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళలకు గాయాలయ్యాయి. యానాలపల్లి నుంచి కె. పెంటపాడు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న భార్యాభర్తలను గూడెం నుంచి గణపవరం వైపు వెళ్తున్న ఇసుక లారీ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో యానాలపల్లికి చెందిన మహిళకు కాలువిరిగి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు



తణుకులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రులు

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలో గురువారం వివిధ అభివృద్ధి పనులను మంత్రులు ప్రారంభించారు. సుమారుగా రూ. 32.18 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంఖుస్థాపనలు నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.